క్లుప్తంగా

25 నుంచి చాగంటి ప్రవచనాలు

కొమ్మాది: ఈ నెల 25వ తేదీ నుంచి 42 రోజుల పాటు మధురవాడ గాయత్రి మహిళా ఇంజినీరింగ్ కళాశాల వేదికగా చాగంటి కోటేశ్వరరావు ప్రవచనాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. కొమ్మాది శ్రీ అష్టలక్ష్మి, శ్రీ వైశాఖేశ్వర స్వామి దేవాలయం, గాయత్రి విద్యాపరిషత్ సంయుక్తంగా ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలియజేశారు. 25వ తేదీ సాయంత్రం 6 నుంచి మార్చి 6వ తేదీ వరకు రోజూ సాయంత్రం సంపూర్ణ రామాయణంపై ప్రవచిస్తారని తెలిపారు.

భీమిలి మాజీ వైస్ చైర్మన్ నర్సింహమూర్తి మృతి



నర్సింహమూర్తి (ఫైల్)

భీమునిపట్నం: భీమిలి మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్, వైఎస్సార్‌సీపీ నాయకుడు బొండా నర్సింహమూర్తి(68) సోమవారం ఉదయం మృతి చెందారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన బ్యాంక్ కాలనీ వద్దనున్న స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. నర్సింహమూర్తి మున్సిపల్ వైస్ చైర్మన్‌గా, భీమిలి కన్యకాపరమేశ్వరి ఆలయ కమిటీ చైర్మన్‌గా సేవలందించారు. బ్యాంక్‌కాలనీ వద్దనున్న కుంచమాంబ అమ్మవారి ఆలయ ఉత్సవాల నిర్వహణలో కీలకంగా వ్యవహరించేవారు. అందరితో ఎంతో స్నేహపూర్వకంగా ఉండడంతో పార్టీలకు అతీతంగా అందరికీ ఆయనపై ప్రత్యేక అభిమానం ఉంది. ఆయన మృతి విషయం తెలుసుకున్న పలువురు వైఎస్సార్‌సీపీ, టీడీపీ నాయకులు, ఇతరులు విచ్చేసి నివాళులు అర్పించారు.

హెల్త్ పింఛన్ల తనిఖీ

పద్మనాభం: మండలంలోని పలు గ్రామాల్లో హెల్త్ పింఛన్లను వైద్యులు సోమవారం నుంచి తనిఖీ చేస్తున్నారు. మండలంలోని పలు గ్రామాల్లో మంచం పట్టిన 33 మంది హెల్త్ పింఛన్లు పొందుతున్నారు. వీరు ఆ పింఛన్లకు అర్హులా కాదా అని వైద్యులు తనిఖీ చేస్తున్నారు. రేవిడి పీహెచ్‌సీ వైద్యురాలు స్వప్న, భీమిలి వైద్యురాలు కల్యాణితో పాటు ఐదుగురి వైద్యుల బృందం ఈ తనిఖీలు చేపట్టింది.

కిశోరి వికాసంపై శిక్షణ నేడు

పద్మనాభం: కిశోరి వికాసంపై సచివాలయ మహిళా పోలీసులు, సంక్షేమ సహాయకులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, హైస్కూల్ నోడల్ ఆఫీసర్లకు వెలుగు కార్యాలయంలో మంగళవారం శిక్షణ ఇవ్వనున్నట్టు ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఉమా జానకి ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం పది గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు ఈ శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు.

రెడ్డిపల్లిలో పశు వైద్యశిబిరం



పశువులకు మందులు పడుతున్న ఏడీ

పద్మనాభం: పశువులకు సోకే వ్యాధుల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని పశు సంవర్ధక శాఖ ఉప సంచాలకుడు ఎం.చంద్రశేఖర్ అన్నారు. మండలంలోని రెడ్డిపల్లిలో సోమవారం నిర్వహించిన ఉచిత పశు ఆరోగ్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. 207 లేగ దూడలు, పాడి పశువులు, 449గొర్రెలు, మేకలు, 96 కోళ్లకు నట్టల వ్యాధి నివారణకు మందులు పట్టారు. పాడి రైతులకు లవణ మిశ్రమ ప్యాకెట్లు పంపిణీ చేశారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కె.దామోదరరావు, గోపాల మిత్ర సన్యాసిరావు పాల్గొన్నారు.

పశువైద్యశిబిరాల పోస్టర్ ఆవిష్కరణ

ఆరిలోవ: జిల్లాలో ఉచిత పశు వైద్య శిబిరాలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఈ శిబిరాలు ఈ నెల 31 వరకు కొనసాగనున్నాయి. ఈ సందర్భంగా శిబిరాల పోస్టర్‌ను పశువైద్యాధికారులతో కలసి కలెక్టర్ ఎం.ఎన్. హరేందిర ప్రసాద్ కలెక్టరేట్‌లో సోమవారం ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో పాడి రైతులు, కోళ్ల తదితర జీవాలు పెంపకందార్లు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగపరుచుకోవాలని సూచించారు.

వివిధ శాఖల అధికారుల నిర్లక్ష్యం.. సమన్వయ లోపం.. ఆ రైతుల పాలిట శాపంగా మారింది. చోరీకి గురైన విద్యుత్ వైర్లకు ఎఫ్ఐఆర్ ఇవ్వడంలో పోలీస్ అధికారుల ఉదాశీనత.. ఆ కాపీ లేనిదే పనులు చేసేది లేదంటూ విద్యుత్ అధికారుల హుకుం నిరక్షరాస్యులైన ఆ రైతుల కంట నీరు తెప్పిస్తోంది. ఓ వైపు ఎండిపోతున్న పంటలు.. వేలల్లో నష్టం.. మరోవైపు కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు.. అన్నదాతల ఆక్రోశం ఏ అధికారినీ కదిలించకపోవడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్నారు. సుమారు 500 మీటర్ల మెటీరియల్ కోసం 45 రోజులుగా **రైతులు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం.**



కట్ చేసిన విద్యుత్ వైర్లను చూపుతున్న రైతులు

ఇంత నిర్లక్ష్యమా?

- చోరీకి గురైన విద్యుత్ వైర్లు
- నీరు లేక ఎండిపోతున్న పంటలు
- కార్యాలయాల చుట్టూ రైతుల ప్రదక్షిణలు
- అయినా పట్టించుకోని అధికారులు

తగరపువలస: వివిధ శాఖల నిర్లక్ష్యానికి ఎండిపోతున్న పంటలే నిదర్శనంగా నిలిచాయి. దొంగల పాలైన విద్యుత్ వైర్ల కారణంగా నిలిచిపోయిన విద్యుత్ సరఫరాను 45 రోజులైనా పునరుద్ధరించకపోవడంలో అడుగడుగునా వైఫల్యం కనిపిస్తోంది.

ఆనందపురం మండలంలోని అదే పంచాయతీలో 2024 డిసెంబరు 5న వ్యవసాయదారులు సాగు చేసుకునే భూములను ఆనుకుని విద్యుత్ స్తంభాలకు ఉన్న 500 మీటర్ల అల్యూమినియం వైర్లను దొంగలు కట్ చేశారు. శ్మశాన వాటిక వెనుక, హెచ్‌పీ గ్యాస్ సిలిండర్ల గొడౌన్‌కు చేరువలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ నుంచి నాలుగు స్తంభాల వైర్లు చోరీకి గురవడంతో వ్యవసాయబావులు, బోరుబావులు ఉన్నా విద్యుత్ సరఫరా లేక పోయింది. దీంతో పదుల సంఖ్యలో వ్యవసాయదారులకు చెందిన సుమారు 40 ఎకరాలలో కొత్తిమీర, మిరప, బెండ, జాజులు, చిక్కుడు, ఫారం గడ్డి, ఆనప వంటి పంటలు ఎండిపోయాయి. ఎన్నో కష్టనష్టాల కోర్చి పెట్టుబడులు పెట్టిన రైతులు పంటలు ఎండిపోవడంతో రూ.వేలల్లో నష్టపోయారు. సంక్రాంతి సీజన్‌లో సిరులు కురిపించే కొత్తిమీర, మిరప, బెండ, జాజులు, టమాటా, బరబాటి ఎండిపోవడంతో తీవ్రంగా నష్టపోయారు. ప్రస్తుతం మల్లెల సీజన్ ప్రారంభమైనా నీరు లేక వాటితో పాటు పశుగ్రాసంగా ఉపయోగపడే గడ్డి క్షేత్రాలు ఎండిపోయాయి.




పాలిపోయిన కొత్తమీర

రూ.50వేలు నష్టపోయాను



నాకు రెండు ఎకరాల మెట్టభూమి ఉంది. సంక్రాంతి సీజన్‌లో అర ఎకరం కొత్తిమీర అమ్మితే రూ.50వేలు వస్తుంది. అలాంటిది నీరు లేకపోవడంతో కొత్తిమీర వాసన లేక, పాలిపోయింది. మల్లె తోటలు బాగుచేసుకుందామంటే నీరు లేదు. జాజులు వాడిపోయాయి. బెండ, మిరప ఎండిపోయాయి.

– చందక సన్యాసప్పుడు, రైతు



ఎండిపోతున్న ఆనప



ఎండిపోతున్న చిక్కుడు



ఆనవాళ్లు లేకుండా ఉండిపోయిన బెండ

తిరగని ఆఫీసు.. కలవని అధికారి లేరు

45 రోజులుగా బాధిత రైతులు స్థానిక విద్యుత్‌శాఖ అధికారులతో పాటు, మధురవాడ, విశాఖలోని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. ఆనందపురం గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రంతో పాటు కలెక్టరేట్‌లోని ప్రజాసమస్యల పరిష్కార వేదికలో కూడా వినతిపత్రం అందించారు. మండల సమావేశంలో తమ సమస్యను రైతులు వివరించగా ఎంపీపీ, జెడ్పీటీసీ కూడా స్పందించారు. వారం రోజుల్లో సమస్య పరిష్కారం అవుతుందని అధికారులు హామీ ఇచ్చారు కానీ విద్యుత్ సరఫరా పునరుద్ధరణ కాకపోవడంతో పంటలు ఎండిపోతూనే ఉన్నాయి. రైతులు ప్రతిరోజూ విద్యుత్ కార్యాలయాల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. విద్యుత్ వైర్లు చోరీకి గురైనట్టు రైతులే పోలీసులకు ఫిర్యాదు చేసి ఎఫ్ఐఆర్ కాపీ తీసుకురావాలని హుకుం చేశారు. నిరక్షరాస్యులైన రైతుల ఆవేదనను విద్యుత్‌శాఖ అధికారులతో పాటు ఆనందపురం పోలీసులు పట్టించుకోలేదు. దీంతో గగ్గోలు పెడుతున్నారు. అధికారులలో చలనం లేకపోడంతో సమీపంలో ఉన్న రైతుల నుంచి పంట తడుపుకోవడానికి నీటి కోసం అర్థిస్తున్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో అధికారులు భయంతో పనిచేసే వారని రైతులు అంటున్నారు. కూటమి ప్రభుత్వంలో అధికారులు మాత్రం 500 మీటర్ల మెటీరియల్ లేదంటూ నెలన్నరగా తాత్సారం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, విద్యుత్ సరఫరాను పునరుద్ధరించి పంటలను కాపాడాలని రైతులు కోరుతున్నారు.

వచ్చేది మాఘమాసం.. పరిస్థితి అగమ్యగోచరం



మరో పది రోజులలో మాఘమాసం ప్రారంభమవుతుంది. పెళ్లిళ్లు, ఫంక్షన్లు ఎక్కువగా ఉన్నాయి. కూరగాయలు, పువ్వులకు డిమాండ్ ఉంది. బావిలో నీరు పుష్కలంగా ఉన్నా చేతులు కట్టేసినట్టయింది. 45 రోజులుగా మోటార్లు పనిచేయకపోవడంతో మట్టి కొట్టుకుపోతున్నాయి. రైతు గుండె చెరువు అవుతున్నా అధికారుల గుండె కరగడం లేదు. వ్యవసాయంపై ఆధారపడ్డ మా నలుగురు అన్నదమ్ముల పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది.

– కామిరెడ్డి ఆదినారాయణ, రైతు

• చిన్న శ్రీనుకు శుభాకాంక్షల వెల్లువ



మజ్జి శ్రీనివాసరావును అభినందిస్తున్న కార్పొరేటర్ కొండబాబు, ఎంపీపీ వాసురాజు



మజ్జి శ్రీనివాసరావుతో కేక్ కట్ చేయిస్తున్న ఆనందపురం నాయకులు

వైఎస్సార్‌సీపీ భీమిలి నియోజకవర్గ సమన్వయకర్తగా నియమితులైన మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను)ను భీమిలి నియోజకవర్గ నాయకులు సోమవారం అభినందనలతో ముంచెత్తారు. విజయనగరం వద్ద ధర్మపురిలోని ఆయన నివాసంలో కలిసి పుష్పగుచ్ఛాలు, శాలువాలు, పూలదండలతో ఘనంగా సత్కరించారు. కేక్‌లు కట్ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలాల వారీగా కార్యకర్తలను, నాయకులను కలిసి అందరి సహకారంతో పార్టీకి పూర్వవైభవం తీసుకువస్తామన్నారు. చిన్న శ్రీను నియామకంతో నియోజకవర్గ పార్టీ నాయకులు, కార్యకర్తల్లో నూతన ఉత్సాహం చోటుచేసుకుంది. – తగరపువలస/పద్మనాభం



శ్రీనివాసరావుకు అనంత పద్మనాభ స్వామి క్షేత్ర వైభవం చిత్రపటాన్ని బహూకరిస్తున్న పద్మనాభం ఎంపీపీ రాంబాబు, లక్ష్మణరావు



మజ్జి శ్రీనివాసరావుతో భీమిలి జోన్ నాయకులు

జోన్-2 పీజీఆర్ఎస్‌కు 18 వినతులు

మధురవాడ: జీవీఎంసీ జోన్-2 మధురవాడ జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు 18 వినతులు వచ్చాయి. జోనల్ కమిషనర్ ఎంవీడీ ఫణిరాం ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఇందులో ఈఈ వర్క్స్ విభాగానికి 6, రెవెన్యూ-5, హార్టికల్చర్-1, పబ్లిక్ హెల్త్-3, యూసీడీ-1, టౌన్ ప్లానింగ్-2 దరఖాస్తులు అందాయి. వీటిపై తక్షణ చర్యలు చేపడతామని జెడ్సీ ఫణిరాం తెలిపారు.

మాస్టర్‌ప్లాన్ రోడ్డు పూర్తి చేయాలి

మధురవాడ హైవే నుంచి సాక్షి కార్యాలయం వరకు ఉన్న 14 గ్రామాల ప్రజలకు ఉపయోగకరమైన నగరంపాలెం మాస్టర్ ప్లాన్ రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేసి, రోడ్డును వినియోగంలోకి తీసుకురావాలని సీఐటీయూ నాయకుడు పి. రాజ్‌కుమార్ కోరారు. ఈ రోడ్డును అసంపూర్తిగా వదిలేయడంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు.

- మధురవాడలో 71వ వార్డు సచివాలయ వ్యవస్థను మెరుగుపరచాలని పౌర సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు ఎల్.ఎస్.నాయుడు, అధ్యక్షుడు నాగోతి సూర్యప్రకాశరావు ఆధ్వర్యంలో నాయకులు వినతి పత్రం ఇచ్చారు.



జెడ్సీకి వినతిపత్రం అందిస్తున్న పౌర సంక్షేమ సంఘం నాయకులు

- మధురవాడ గణేష్‌నగర్‌లోని ఏఎస్ఆర్ పార్కులో గల అల్లూరి సీతారామరాజు విగ్రహాన్ని ఆకతాయిలు గీతలు గీసేసి పాడు చేశారని దానిని పరిరక్షించాలని సీపీఐ నాయకులు వాండ్రాసి సత్యనారాయణ తదితరులు కోరారు.
- హార్టికల్చర్ విభాగం వారు తమ పార్కులో ఉన్న మొక్కలను వేరే ప్రాంతాలు తరలిస్తున్నారని, ఇది సరికాదని బక్కన్నపాలెం రైల్వే ఆఫీసర్స్ లే అవుట్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు జెడ్సీ దృష్టికి తీసుకువచ్చారు.
- జీవీఎంసీలో పని చేస్తున్న వ్యక్తే రోడ్డు మీద పశువులు కట్టి రాకపోకలకు ఇబ్బందులు కలుగ జేస్తున్నాడని చర్యలు చేపట్టాలని కె. వరహా నరసింహ మూర్తి ఫిర్యాదు ఇచ్చారు.

జోన్-1లో 10 ..

భీమునిపట్నం: భీమిలి జోనల్ కార్యాలయం వద్ద జెడ్సీ ప్రేమ ప్రసన్నవాణి ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌కు పది వినతులు వచ్చాయి. ఇందులో ఇంజినీరింగ్ విభాగానికి సంబంధించి ఏడు వినతులు, పట్టణ ప్రణాళిక విభాగానికి సంబంధించి రెండు, ప్రజారోగ్య విభాగానికి సంబంధించి ఒక వినతి ఉన్నాయి. ఈ వినతులను పరిశీలించి, పరిష్కరిస్తామని జెడ్సీ తెలిపారు.

పద్మనాభం తహసీల్దార్ కార్యాలయంలో..

పద్మనాభం: తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పది మంది దరఖాస్తు చేశారు. రెడ్డిపల్లిలో శిథిలావస్థలో ఉన్న ఏఎన్ఎం సబ్‌సెంటర్ స్థానంలో అద్దె భవనం తీసుకునేందుకు అనుమతి ఇవ్వాలని సూపర్‌వైజర్ సతీష్ కుమార్ తహసీల్దార్ ఆనందరావుకు వినతి పత్రం ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీడీవో ఎం.విజయ కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

లారీ కార్మికుల ఆందోళన

పద్మనాభం: తమకు కూలి రేట్లు పెంచాలని కోరుతూ మండలంలోని మద్దిలో లారీ కార్మికులు సోమవారం ఆందోళన చేశారు. వ్యాన్‌కు ఇటుకలు లోడు చేసేందుకు ఇస్తున్న రూ.650 ను రూ.700కు పెంచాలని, లారీకి రూ.1300 నుంచి రూ.1400 పెంచాలని ఆందోళనకు దిగారు. ఈ రేట్లు పెంచడానికి ఇటుక బట్టీ యజమానులు ముందుకు రాలేదు. దీంతో ఇటుక బట్టీ యజమానులు మొండి వైఖరి విడనాడాలని కార్మికులు నినాదాలు చేశారు. తమను కాకుండా వేరే కార్మికులతో ఇటుకలు లోడ్ చేయిస్తే అడ్డుకునేందుకు కార్మికులు నిర్ణయించారు.

కుదిరిన ఒప్పందం

సీఐటీయూ నాయకుడు ఆర్ఎస్ఎన్ మూర్తి, రవ్వ నర్సింగరావు, ఇటుక బట్టీ యజమానులతో సీఐ శ్రీధర్ చర్చలు జరిపారు. వ్యాన్‌కు లోడ్ చేసేందుకు రూ.675, లారీకి రూ.1350 ఇవ్వడానికి ఒప్పందం కుదిరింది. దీంతో కార్మికులు ఆందోళనను విరమించారు.



ఆందోళన చేస్తున్న లారీ కార్మికులు

బాల్యం నుంచే క్రమశిక్షణ అవసరం



మాట్లాడుతున్న ఎస్ఐ హరీష్

తగరపువలస: విద్యార్థి దశ నుంచే క్రమశిక్షణ అలవాటు చేసుకోవాలని భీమిలి ఎస్ఐ గంటా హరీష్ సూచించారు. సమాజాన్ని న్యాయబద్ధంగా మార్చే శక్తి విద్యార్థులకే ఉందన్నారు. భీమిలి మండలం తాటితూరు జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు సోమవారం పలు విషయాలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు, మొబైల్ వినియోగం, సైబర్ క్రైమ్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్ఎం ప్రసాదరావు, పాఠశాల కమిటీ చైర్మన్ సోమేశ్వరరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

యోగా మాస్టర్ కళాధరరావుకు స్వర్ణ కంకణం

మధురవాడ: మధురవాడకు చెందిన యోగా మాస్టర్ వీకేవీకే కళాధరరావు మరో జాతీయస్థాయి పురస్కారం అందుకున్నారు. కరీంనగర్ ఫిల్మ్‌భవన్‌లో శ్రీ ఆర్యాణి సకల కళావేదిక, శ్రీ గౌతమేశ్వర సాహితి కళా సేవా సంస్థలు జాతీయ స్థాయిలో సంక్రాంతి ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేశాయి. ఇందులో భాగంగా యోగా వ్యాప్తికి 18 ఏళ్ల పాటు విశేష కృషి చేసిన కళాధరరావుకు నిర్వాహకుడు డాక్టర్ దూడపాక శ్రీధర్ అవార్డు అందజేసి, స్వర్ణ కంకణాన్ని బహూకరించారు. ఈ సందర్భంగా కళాధరరావును పలువురు అభినందించారు.



కళాధరరావుకు స్వర్ణ కంకణాన్ని బహూకరిస్తున్న నిర్వాహకులు

విద్యుత్ సమస్యల పరిష్కార వేదిక నేడు

తగరపువలస: ఏపీఈపీడీసీఎల్ విశాఖ డివిజన్ జోన్-3 ఆధ్వర్యంలో ఆనందపురం ఎంపీడీవో సమావేశ మందిరంలో మంగళవారం విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నారు. ఈ వేదికపై పరిష్కార వేదిక చైర్‌పర్సన్ బి.సత్యనారాయణ, సాంకేతిక సభ్యులు ఎస్.మసిలమణి, ఆర్థిక సభ్యుడు షేక్ బాబర్, స్వతంత్ర సభ్యుడు ఎస్.మురళీకృష్ణ హాజరుకానున్నారు. విద్యుత్ వినియోగదారులంతా ఈ వేదికలో పాల్గొని తమ సమస్యల పరిష్కారం కొరకు వినియోగించుకోవాలని ఆనందపురం విద్యుత్ సబ్‌స్టేషన్ ఏఈఈ సురేష్‌కుమార్ ఒక ప్రకటనలో కోరారు.

'కూటమి' కనుసన్నల్లో సర్వీస్ ప్రొవైడర్ల గుర్తింపు

- మొక్కుబడి తంతుగా మేళా
- అంతా తామై నడిపించిన టీడీపీ, బీజేపీ నాయకులు

మధురవాడ: జీవీఎంసీ 5, 6, 7, 8 వార్డులకు సంబంధించి స్థానిక అవంతి ఫంక్షన్ హాల్లో నిర్వహించిన సర్వీసు ప్రొవైడర్ గుర్తింపు మేళాను కూటమి నాయకులు మొక్కుబడి తంతుగా మార్చేశారు. వాక్ టు వర్క్ భావనతో వివిధ వృత్తుల వారికి స్వయం ఉపాధి అవకాశాలు కల్పించేందుకు, తలసరి ఆదాయాన్ని పెంచేందుకు మెప్మా, హోం ట్రయాంగిల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ మేళాను టీడీపీ, బీజేపీ నాయకులు అంతా తామై నడిపించారు. ఈ మేళాలో ఎలక్ట్రీషియన్, కార్పెంటర్, టైలరింగ్ తదితర వృత్తుల్లో ఉన్న వారు పేర్లు నమోదు చేసుకున్నట్టు టీడీపీ నాయకులు ప్రకటించారు. త్వరలో వీరికి ట్రైనింగ్, గుర్తింపు కార్డులు పంపిణీ చేస్తామని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులే సర్వీసు ప్రొవైడర్లకు పత్రాలు అందజేయడం గమనార్హం.



పీఎం పాలెంలో సర్వీసు ప్రొవైడర్లకు పత్రాలు అందజేస్తున్న టీడీపీ నాయకులు

జోన్-1లో 68మంది నమోదు

భీమునిపట్నం: సర్వీస్ ప్రొవైడర్స్ మేళా ద్వారా స్వయం ఉపాధి పొందడానికి అవకాశాలు బాగుంటాయని జోన్-1 జోనల్ కమిషనర్ ప్రేమప్రసన్న వాణి అన్నారు. భీమిలి జోనల్ కార్యాలయం వద్ద మెప్మా, హోంట్రయాంగిల్ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన సర్వీస్ ప్రొవైడర్స్ గుర్తింపు మేళాలో ఆమె మాట్లాడారు. ఇక్కడ పేర్లు నమోదు చేసుకున్న వారికి శిక్షణ ఎప్పుడు ఉంటుందో సమాచారం ఇస్తామన్నారు. ఎంపిక చేసిన విభాగంలో ఆసక్తి గల వారికి శిక్షణ ఇస్తామన్నారు. ఈ మేళాలో విద్యుత్, ప్లంబింగ్, వడ్రంగి, టీవీ మెకానిక్, బ్యూటీషియన్ మొదలైన వాటికి సంబంధించి 68మంది పేర్లు నమోదు చేసుకున్నారు.



జోన్-1 కార్యాలయంలో మాట్లాడుతున్న జోనల్ కమిషనర్ ప్రేమ ప్రసన్నవాణి